క్లుప్తంగా

మహిళలు బలవర్ధక ఆహారం తీసుకోవాలి



కొల్లూరు : మహిళలు బలవర్ధక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ అమృతలూరు ప్రాజెక్టు సీడీపీఓ గన్నవరపు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కొల్లూరులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆరోగ్యవంతమైన మహిళ-సంతోషకరమైన మహిళ అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు బలవర్ధకమైన ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఎం సంధ్యారాణి, కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆది ఆంధ్ర సొసైటీ పాలక వర్గానికి నోటీసులు జారీ

బాపట్ల: బాపట్ల పట్టణంలోని దగ్గుమల్లివారి పాలెం ఆది ఆంధ్ర సొసైటీ పాలకవర్గానికి ప్రత్యేక అధికారి ఎస్ఎస్పీ చంద్రకుమార్ మంగళవారం నోటీసులు జారీ చేశారు. సొసైటీ పరిధిలోని 101 మంది సభ్యులు రూ.1.35 కోట్లను పంట పెట్టుబడి రుణాల రూపంలో ఒక్కొక్కరు లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు తీసుకున్నారు. తీసుకున్న రుణాలను చెల్లించకపోవటంతో విచారణ చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఎస్ఎస్పీ చంద్రకుమార్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఈ మేరకు పంట పెట్టుబడికి తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని ప్రత్యేకాధికారి తొలి నోటీసులను జారీ చేశారు.

అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నగరం: అత్యాచారానికి గురైన ఎస్టీ మైనర్ బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బహుజన మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు జీఆర్ భగత్‌సింగ్ చెప్పారు. నగరంలో ఇటీవల అత్యాచారానికి గురైన ఎస్టీ మైనర్ బాలిక కుటుంబాన్ని మంగళవారం బీసీ ప్రజా సంఘాల నేతలు పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో భగత్ సింగ్ మాట్లాడుతూ అభం శుభం తెలియని మైనర్ బాలికను అత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. పేద ఎరుకల కుటుంబానికి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. అత్యాచారానికి పాల్పడిన నిందితుణ్ని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి 5 ఎకరాల భూమి, ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేయించి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ బాలికలపై అత్యాచారాలు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి పిల్లలను చదివించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పరామర్శించిన వారిలో రజక సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఎరుకల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఊసవరపు వెంకట్రావు ఉన్నారు.

యూబీఐ సేవలను ఉపయోగించుకోండి



తెనాలి అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను అందరూ ఉపయోగించుకోవాలని ముంబయిలోని సెంట్రల్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ పేర్కొన్నారు. తాడిబోయినవారి వీధిలోని బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ఎంఈ మెగా అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ లోన్‌లకు సంబంధించిన మంజూరు పత్రాలను ఖాతాదారులకు అందించారు. బ్యాంక్ గుంటూరు రీజియన్ హెడ్ ఎస్.జవహర్, బ్యాంకు మేనేజర్ శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్సంగ కేంద్రం వార్షికోత్సవం

తెనాలి రూరల్: మండల గ్రామం అంగలకుదురులోని సాయిబాబా సత్సంగ కేంద్రం 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు పలు ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నదానం చేశారు. సత్సంగ కేంద్రం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మేనేజర్ సేవలు మరువరానివి

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేసిన దేవసేన సేవలు మరువరానివని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు పేర్కొన్నారు. దేవసేన వీడ్కోలు సభను మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి రావు, ఆర్వో రామ్‌ప్రసాద్, డీఈ సుబ్బారావు, ఏసీపీ శివన్నారాయణ పాల్గొన్నారు.

పల్లె పండుగ ఉత్తుత్తిదేనా..!?

- రోడ్ల నిర్మాణం, మరమ్మతుల్లో తీవ్ర జాప్యం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం
- మెటల్ పోసి పనులు చేయకుండా తాత్సారం
- చోద్యం చూస్తున్న ఆర్ అండ్ బీ యంత్రాంగం
- నెలలు గడుస్తున్నా ముందుకు కదలని పనులు



తడికలపూడి-గుంటూరు గూడెం మధ్య మెటల్ డస్ట్ పోసి బీటీ లేయర్ వేయకపోవడంతో ప్రమాదకరంగా రహదారి

కొల్లూరు : రహదారుల మరమ్మతులే ప్రథమ కర్తవ్యం అంటూ డాంబికాలు పలికిన కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను గాలికి వదిలివేయడం ప్రయాణికులకు శాపంగా మారింది. పల్లె పండుగ పేరుతో సంక్రాంతి లోపు రహదారుల మరమ్మతులు, నిర్మాణాలు పూర్తి చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టిన కూటమి నేతలు పనులు జరగకుండా నిలిచిపోయి నెలలకు నెలలు గడుస్తున్నా పట్టించుకున్న పాపాన పోకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పల్లె పండుగ ఉత్తుత్తిదేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కృష్ణా నది వరదలు, అనంతరం కురిసిన వర్షాల కారణంగా నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో అధిక శాతం రహదారులు దెబ్బతిన్నాయి. రహదారులు ఛిద్రమవడంతో సుమారు 12 లంక గ్రామాల్లోని 14 వేలకు మందికి పైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవడంతోపాటు, అనంతవరం, చిలుమూరు, ఈపూరు గ్రామాల్లో 4 వేల మంది ప్రయాణ కష్టాలను అనుభవిస్తున్నారు. డిసెంబర్ నెలలో అట్టహాసంగా మరమ్మతులు చేపట్టేందుకు ఆర్ అండ్ బీ అధికారులు కాంట్రాక్టర్లతో పనులు ఆరంభింపజేయడంతోనే తమ పని ముగిసినట్లు చేతులు దులుపుకోవడం ప్రజలకు ప్రయాణ కష్టాలను రెట్టింపు చేశాయి.



కిష్కిందపాలెం వద్ద గుంతల్లో పోసిన మెటల్ పక్కకు వైదొలగిపోయి తిరిగి ఏర్పడుతున్న గుంత



తురకపాలెం వద్ద వరదలకు కోతకు గురై ప్రమాదకరంగా నిలిచిన రహదారి

తరచూ ప్రమాదాలు

రహదారుల మరమ్మతులు, నిర్మాణాల విషయంలో ఆర్ అండ్ బీ అధికారుల ఉదాశీనత ప్రజల ప్రాణాల మీదుకు తీసుకువస్తుంది. మూడు నెలల నుంచి రహదారుల మరమ్మతుల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌తో పనులు చేయించే విషయంలో ఆర్ అండ్ బీ యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్లు కానవస్తుందని ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారులను పెకిలించి, మెటల్ డస్ట్, వెట్ మిక్స్ వంటి రహదారి నిర్మాణ ముడిసరుకుతో నింపి నెలల నుంచి కాలయాపన చేస్తుండటంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. భారీ వాహనాలు ప్రయాణిస్తున్న సమయంలో వాటి చక్రాల కింద పడిన మొనదేలిన గులకరాళ్లు పక్కన ప్రయాణిస్తున్న వారికి తాకి తీవ్ర గాయాలకు గురవుతున్నారు. రోడ్లపై మెటల్ పరచి కనీస ప్రమాణాలు పాటించకుండా వదిలేయడంతో ద్విచక్ర వాహనాలు మెటల్‌పై జారిపోయి గాయాల పాలై ప్రమాదం అంచున ప్రయాణం సాగిస్తున్నారు.

కళ్లలో దుమ్మే

రహదారుల వ్యవస్థ అధ్వానంగా తయారవడం, మరమ్మతులు చేపట్టకుండా మెటల్, డస్ట్‌తో రోడ్లను నింపి పనులు ముందుకు కొనసాగించకపోవడంతో ప్రయాణికుల కళ్లు దుమ్ము ధూళితో నిండి పోతున్నాయి. భారీ వాహనాలు ఈ రహదారులపై వెళుతుండటంతో వెనుక ప్రయాణించే వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా తయారైంది.

మెటల్, డస్ట్‌ను రోడ్ల నిండుగా పరిచిన కాంట్రాక్టర్లు నిబంధనల మేరకు నిరంతరం నీళ్లతో తడుపుతూ రోలింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ ప్రమాణాలను పాటించకపోవడంతో కొల్లూరు-పెసర్లంక, గాజుల్లంక-కిష్కిందపాలెం, తడికలపూడి-గుంటూరుగూడెం, అనంతవరం-చిలుమూరు, పెసర్లంక-చింతర్లంక మార్గాలలో రాకపోకలు సాగించాలంటే దుమ్ముతో నిండిపోవడం పరిపాటిగా మారుతుంది. రహదారుల నిర్మాణంలో చోటు చేసుకుంటున్న తీవ్ర జాప్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగం తక్షణం స్పందించి రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏ రాయి తాకుతుందోనని భయం



రోడ్ల మరమ్మతులు చేపట్టకుండా నిలిపివేయడంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఏ రాయి వచ్చి ఎక్కడ తగులుతుందో తెలియని భయంలో ప్రయాణం సాగించాల్సి వస్తుంది. అనంతవరం-చిలుమూరు మార్గాన్ని డిసెంబర్‌లో పెకిలించి, మెటల్ వేసి నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నాం. రాళ్లు తగిలి ఎవరి ప్రాణాలు పోగొట్టుకోవాలో తెలియని ఆందోళనలో.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగించాల్సి వస్తుంది.

– బొనిగల సుబ్బారావు, ప్రజా సంఘాల నాయకుడు, అనంతవరం

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



కర్లపాలెం: రబీ సీజన్‌కు పంట నమోదు చేయించుకున్న రైతుల పేర్లు సామాజిక తనిఖీ కొరకు రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తారని ఏడీఏ లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని కర్లపాలెం, బుద్ధాం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ పంట నమోదు రైతుల జాబితాలో ఏవైనా సవరణలు ఉంటే 17వ తేదీలోపు గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని చెప్పారు. తుది జాబితా సవరణల తరువాత 21వ తారీఖున రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తారని ఆమె తెలిపారు. రైతులందరూ గుర్తింపు సంఖ్యను సత్వరమే పొందాలని ప్రస్తుతం సొంత భూమి ఉన్న రైతులకే గుర్తింపు సంఖ్య ఇస్తున్నారని రెండవ దశలో కౌలు రైతులకు కూడా గుర్తింపు సంఖ్య ఇవ్వటం జరుగుతుందన్నారు. గుర్తింపు సంఖ్య పొందిన రైతులు మాత్రమే వ్యవసాయ సబ్సిడీ పథకాలను పొందగలరని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, వ్యవసాయ సహాయకులు భ్రమరాంబ, బాజీ, రైతులు ఉన్నారు.

జీవన విధానంలో మార్పు అవసరం

తెనాలి టౌన్: ప్రతి ఒక్కరూ మంచి జీవనశైలి అలవాటు చేసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని శబరి వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు సుష్మితరమేష్ అన్నారు. ఒబేసిటీ డే సందర్భంగా మంగళవారం రజక చెరువు ఐలమ్మ పార్కులో వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఇషారేద్ ఖాన్, మాధవి, పార్వతి, కుమారి ఉన్నారు.

పేదలపై విషం చిమ్ముతున్న చంద్రబాబు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



గ్రామ నూతన కమిటీలో ఎన్నికైన సభ్యులను సత్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి

కొల్లూరు : కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి పేదలు పైకి రాకుండా సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ అనుయాయులు విషం చిమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. మంగళవారం మండలంలోని జువ్వలపాలెంలో నూతన గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల రూపంలో పాలు పోస్తే, నేడు సీఎం చంద్రబాబు మాత్రం పేదలు పైకి రాకూడదన్న ఒకే ఒక్క లక్ష్యంతో విషం కక్కుతున్నారన్నారు. టీడీపీలో దుర్మార్గులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని బడుగు, బలహీన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఓ పక్క కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూనే వెనుకబడిన వర్గాలకు కప్పం కట్టనిదే ఇసుక రవాణాకు అనుమతించని పరిస్థితి కొనసాగుతుందన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలను సహించే ప్రసక్తి లేదని అమాయకులను, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. పోలీసులు పసుపు చొక్కాలు వేసుకొని టీడీపీ నాయకులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. గ్రామ నూతన కమిటీ ఎంపికలో భాగంగా జువ్వలపాలెంలో దోవ వెంకటేశ్వరరావును కన్వీనర్‌గా, గుంటూరు ప్రభుదాస్‌ను ఉప కన్వీనర్‌గా, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు, సర్పంచి భూపతి కిశోర్, ఎంపీటీసీలు గుంటూరు రామారావు, బుల్లా నవరత్నం, నన్నెపాముల చంటి, ఉప సర్పంచి బొప్పన సాంబయ్య, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, నాయకులు నాదెళ్ల కోటయ్య, గుంటూరు పవన్, దివి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు యన్నం జీవన్, కంచర్ల నాగరాజు, కౌంరి కామేశ్వరరావు, భూపతి లంకేశ్వరరావు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన గ్రామ కమిటీల ఎంపిక

మండలంలోని కిష్కిందపాలెం, తడికలపూడి, పోతార్లంక, తిప్పలకట్ట, తోకలవారిపాలెం గ్రామాలలో నూతన గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు తెలిపారు.

వర్క్ ఫ్రం హోమ్ సర్వేను యువత సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని

చెరుకుపల్లి: మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఐటీ, ఇతర ఉద్యోగాలకు వర్క్ ఫ్రం హోమ్ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సుభాని మాట్లాడుతూ ఉద్యోగాలకు అర్హులైన వారిని గుర్తించేందుకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్ వలన కలిగే ప్రయోజనాలు, సవాళ్లు, కావాల్సిన మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రభుత్వానికి తెలియపరిచేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రానికి చెందిన యువత స్వగ్రామంలోనే ఉంటూ ఉద్యోగం చేసుకునే అవకాశం ఉంటుందని తద్వారా గృహ అద్దె, ఇతర ఖర్చులు తగ్గి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి మార్గం సులభతరమవుతుందని చెప్పారు. కావున మండలంలోని యువత ఈ సర్వేలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

దళితుడిపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తుల దాడి

బాధితుడికి మద్దతుగా దళిత సంఘాల నాయకులు



చికిత్స పొందుతున్న సురేష్

భట్టిప్రోలు (కొల్లూరు) : దళిత వ్యక్తిపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడికి పాల్పడి పంట పొలానికి వస్తే చంపుతామని బెదిరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని పెసర్లంకకు చెందిన యన్నం సురేష్ సోమవారం సాయంత్రం తన పొలంలో పని ముగించుకొని విద్యుత్ మోటార్‌పై రక్షణగా టార్పాలిన్ కప్పేందుకు వెళ్లిన సమయంలో దేవభక్తుని సాంబశివరావు, అతని అనుచరులు పొలంలోకి వచ్చావంటే చంపుతామని బెదిరింపులకు దిగారు. నా పొలంలోకి నేను వస్తే మీకేంటని సురేష్ ప్రశ్నించడంతో కులం పేరుతోపాటు, అసభ్య పదజాలంతో దూషిస్తూ మాకే ఎదురు చెపుతావా అంటూ గొంతు నులిమి హత్యాయత్నంకు పాల్పడటంతోపాటు, రాడ్లుతో దాడికి దిగడంతో గాయాలకు గురయ్యాడు. మాపొలం పక్కన నువ్వు వ్యవసాయం చేసేటంతడి వాడివా అంటూ దాడి చేస్తుండటంతో కాళ్లు పట్టుకుంటాను కొట్టొద్దంటూ వేడుకున్నప్పటికీ కనికరం చూపలేదు. మాపై పెట్టిన కేసులన్నీ వెనక్కి తీసుకోవడంతోపాటు, జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీస్‌లో చేసిన ఫిర్యాదును వెనక్కు తీసుకొని కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరితేనే పొలంలోకి రానిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. మేము చెప్పిన విధంగా చేయని పక్షంలో పొలంలో పంట పండించుకునే ప్రసక్తే లేదని, ఒక వేళ పొలంలోకి వస్తే చంపడానికైనా సిద్ధమని హెచ్చరికలకు దిగారు. ప్రస్తుతం సాగులో ఉన్న కాకర పంట పందిళ్లను ధ్వంసం చేశారు. గతంలో తనతోపాటు, తన కుటుంబ సభ్యులపై అనేకమార్లు దాడులు చేసినప్పటికీ రెవెన్యూ, పోలీసు అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదని కన్నీటి పర్యంతమయ్యాడు. దాడిలో గాయాలకు గురై రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సురేష్‌ను హ్యూమన్ రైట్స్ నాయకులు, దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు మంగళవారం పరామర్శించారు. దాడికి గురైన సురేష్‌కు న్యాయం జరగని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని దళిత సంఘాల నాయకులు తెలిపారు.

'శిశిరం' సినిమా షూటింగ్

తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై తెనాలికి చెందిన కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో రూపొందుతున్న బాలల సినిమా 'శిశిరం' షూటింగ్ తెనాలి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా కొనసాగుతోంది. స్థానిక చినరావూరులోని మంగళవారం జరిగిన షూటింగ్‌ను వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత క్లాప్ కొట్టి ప్రారంభించారు. చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్ వివరాలను తెలియజేశారు.

వృద్ధుడు అనుమానాస్పద మృతి



వేమూరు : వృద్ధుడు పంట పొలంలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన మండలంలోని బలిజేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బలిజేపల్లికి చెందిన వేజెండ్ల పూర్ణచంద్రరావు (70) తన పొలంలో విద్యుత్ మోటార్ పంప్ హౌస్ పక్కన మృతి చెంది ఉన్నాడు. వృద్ధుడికి గాయాలుండటంతో తొలుత కాలుజారి పడటంతో పక్కనే ఉన్న రాయిపై పడి గాయాలకు గురై మృతి చెంది ఉండవచ్చునని భావించారు. అయితే మృతుడి కుడి చెవి దగ్గర, ముక్కు పైన గాయాలుండటం, ఎడమ కంటి మీద వాపు ఉండటంతో ప్రమాదవశాత్తూ మరణించాడా, ఇతర కారణాలున్నాయా అన్న అనుమానంతో మృతుడి కుమారుడు ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు పరిశీలించారు.

గేదెలు చోరీ

కర్లపాలెం: మండల పరిధిలోని చింతాయపాలెం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు మూడు గేదెలు, మూడు దూడలను చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల మేరకు చింతాయపాలెం గ్రామంలో కాగిత ముక్కంటికి చెందిన మూడు గేదెలు, మూడు దూడలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తోలుకు వెళ్లారని తెలిపారు. ముక్కంటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

తెనాలి అర్బన్: గర్భిణులు మంచి పోషక విలువల ఆహారాన్ని తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. డీపీఎంవో జంగం శ్యామ్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి బాధితులను గుర్తించి వారికి చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి అంటే బాలచంద్రమౌళి మాట్లాడుతూ అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హెచ్‌వీ సీహెచ్ ప్రసన్న పుష్పలత, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థల సేకరణను వేగవంతం చేశాం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. దీనిపై గృహాల నుంచి వచ్చే చెత్తను రహదారులపై, కాల్వల్లో పడవేయకుండా చెత్త కుండీల వద్ద పడవేయటం గానీ, పారిశుధ్య సిబ్బందికి అందించే విధంగా గానీ అవగాహన కల్పించామన్నారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు పది ఎకరాల స్థలం అవసరమని ప్రభుత్వానికి నివేదించామన్నారు. అయితే 2047 విజన్‌లో భాగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణానికి 70 ఎకరాల వరకు డంపింగ్ యార్డుకు స్థల సేకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని స్థల సేకరణను వేగవంతం చేశామన్నారు. పట్టణంలో పార్కుల అభివృద్ధికి మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయింపు చేశామన్నారు. 2వ వార్డులోని మున్సిపల్ పార్కును రూ.2 లక్షలతో అభివృద్ధి చేసామని, చంద్రమౌళి పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించామన్నారు.

సర్వేలకు ప్రజలు సహకరించాలి

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేలకు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ సాంబశివరావు కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణంలో సచివాలయ ఉద్యోగులు పలు రకాల సర్వేలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబ ఆర్థిక స్థితిగతులు తెలుసుకునేందుకు సోషియల్ ఎకనామికల్ సర్వే, లోకల్-నాన్ లోకల్ వివరాల సర్వే, కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునేందుకు పీ-4 సర్వే, ఉద్యోగుల వివరాలు తెలుసుకునేందుకు వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేలు జరుగుతున్నాయన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రజలు తమ వివరాలను తెలియజేసి సహకరించాలన్నారు. అయితే సైబర్ మోసాలు అధికమవుతున్న నేపథ్యంలో ఫోన్‌లో ఓటీపీలను తెలియజేయరాదని, ఉద్యోగులు ఇంటికి వచ్చిన పక్షంలోనే తమ వివరాలు వెల్లడించాలని పేర్కొన్నారు.

ఆశా వర్కర్‌ల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్




క్లస్టర్ అధికారి సాయికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశాలు

రేపల్లె రూరల్: ఆశా వర్కర్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. సమస్యల సాధనకై ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా రేపల్లె క్లస్టర్ అధికారికి, మోళ్లగుంట, విశ్వేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాలు అందజేసి అనంతరం మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు 30 సంవత్సరాల సర్వీసు ఉంటేనే గ్రాడ్యుటీ చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అనటం పరోక్షంగా గ్రాడ్యుటీ చెల్లించమని చెప్పటమేనన్నారు. ధరలు పెరుగుతున్నా కనీస వేతనాలు చెల్లించటానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటం శోచనీయమన్నారు. పెరిగిన ధరల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లను ఆశాలుగా మార్పు చేయాలని అన్నారు. దశల వారీగా ఆశా వర్కర్లకు ఏఎన్ఎం శిక్షణనిచ్చి సర్టిఫికెట్స్ ఇవ్వాలని, ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, ఆరోగ్య భద్రతా చట్టం చేయాలని అన్నారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర ప్రతినిధి వర్గంతో గతంలో జరిపిన చర్చల ఒప్పందాల జీవోలు, సర్క్యులర్‌లను వెంటనే విడుదల చేయాలని ఈ నెల 6వ తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ సీనియర్ రేపల్లె మండలం అధ్యక్షురాలు సీహెచ్ వీరలక్ష్మి, నాయకులు గ్లోరీ, బుజ్జి, మల్లేశ్వరి, ఎస్తేరు రాణి, కమల తదితరులు పాల్గొన్నారు.

విజయంపై న్యాయవాదుల హర్షం

తెనాలి రూరల్: ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కొత్తపేటలోని కోర్టు వద్ద తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జున రావు తదితరుల నేతృత్వంలో ఎమ్మెల్సీగా ఆలపాటి విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాస్ గౌరీ శంకర్, న్యాయవాదులు ఆర్.అనిత, సీహెచ్.శారద, బొంత వీరాంజనేయులు, వి.జయప్రకాష్, అప్పల కిషోర్ కుమార్, హరీష్, టి.కొండయ్య, నన్నపనేని రవికృష్ణ, రవి, డి. శ్రీకాంత్, బి. ఫణిబాబు, కోటేశ్వరరావు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు కీలకం



కవెవరంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటలక్ష్మి

తెనాలి టౌన్: మొక్కజొన్న సాగులో చీడపీడల నివారణకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి సూచించారు. రూరల్ మండలం కవెవరం గ్రామంలో మంగళవారం రైతు శిక్షణ, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. రైతులకు మొక్కజొన్నలో చీడపీడల యాజమాన్య పద్ధతులు, రబీ పంట అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమార్ , తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, కవెవరం వీఏఏ భాను, ఏఈవోలు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.